క్లుప్తంగా

బలిజలను బీసీల్లో చేర్చాలని పాదయాత్ర



సాన ప్రసాద్‌రాయల్‌ను సత్కరిస్తున్న అంజూరు తారక శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: బలిజలను బీసీలో చేర్చాలని ఒంగోలుకు చెందిన సాన ప్రసాద్ రాయల్ చిత్తూరు నుంచి అమరావతికి పాదయాత్ర చేపట్టారు. అందులో భాగంగా శుక్రవారం ఆయన శ్రీకాళహస్తికి చేరుకున్నారు. శ్రీకాళహస్తీశ్వరాలయం వద్ద ఉన్న శ్రీకృష్ణదేవరాయల విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, బలిజ నాయకులు అక్కడికి చేరుకుని ఆయన పాదయాత్రకు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో శ్రీకాళహస్తి బలిజ నాయకులు పాల్గొన్నారు.

ఉపకార వేతనాలకు దరఖాస్తులు

శ్రీకాళహస్తి: కేంద్ర కార్మిక, ఉపాధిశాఖ కింద పనిచేస్తున్న బీడీ కార్మికుల కుటుంబాలకు చెందిన విద్యార్థులకు 2025–26 విద్యాసంవత్సరానికి సంబంధించి ఉపకార వేతనాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పట్టణంలోని బీడీ కార్మికుల వైద్యాధికారి డాక్టర్ వెంకటభాస్కర్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. 1 నుంచి 10వ తరగతి వరకు చదివే విద్యార్థులు ఆగస్టు 31లోపు, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, ప్రొఫెషనల్ కోర్సులుచదివే విద్యార్థులు అక్టోబరు 31లోపు సంబంధిత వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

గుర్తు తెలియని వృద్ధురాలు మృతి



వృద్ధురాలి మృతదేహం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పట్టణ శివారులోని బైపాస్‌రోడ్డులో శుక్రవారం గుర్తు తెలియని వాహనం ఢీకొని గుర్తు తెలియని వృద్ధురాలు(65) మృతి చెందింది. శ్రీకాళహస్తి రెండవ పట్టణ పోలీసుల కథనం మేరకు.. గుర్తు తెలియని వృద్ధురాలిని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మరణించిందన్నారు. మృతురాలి వివరాల కోసం ఆరా తీసినా.. లభ్యం కాకపోవడంతో శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రి మార్చురీకి మృతదేహాన్ని తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆవుపై దాడి



ఆవు శరీరంపై గాయాలు

తొట్టంబేడు: మండలంలోని విరూపాక్షపురం శ్రీకాళహస్తీశ్వరాలయ అనుబంధ అర్ధనారీశ్వరాలయంలో శుక్రవారం గోవుపై ఆలయ ఉద్యోగి పారతో దాడి చేశాడు. తాను ఆలయంలోకి వెళ్తున్నప్పుడు గోవు తనపైకి కొమ్ములు విసిరిందన్న అక్కసుతో పక్కనే ఉన్న పార తీసుకుని దానిని కొట్టాడు. ఆలయ పరిసరాల్లో గోవులను పూజించే దగ్గరే ఈ విధంగా గోవులపై దాడి చేయడం బాధాకరమని భక్తులు వాపోయారు. అతనిపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో నష్టం

శ్రీకాళహస్తి: పట్టణంలోని 28వ వార్డు మిట్టకండ్రిగ వద్ద ఉన్న మన్నవరం చంగల్ నాగిరెడ్డి ఇంటిలో గురువారం మధ్యాహ్నం ఎవరూ లేని సమయంలో షార్ట్ సర్క్యూట్ జరగడంతో దుస్తులు, ఎలక్ట్రానిక్ వస్తువులు కాలిపోయాయి. ఇంట్లో నుంచి దట్టమైన పొగ రావడంతో స్థానికులు గుర్తించి మంటలను అదుపు చేశారు. అప్పటికే దుస్తులు, ఎలక్ట్రానిక్ వస్తువులు కాలిపోయి తీరని నష్టం వాటిల్లిందని వాపోయారు. వారు శుక్రవారం అగ్నిమాపక అధికారులకు ఫిర్యాదు చేయగా, పరిశీలించి నష్టం అంచనా వేస్తామని తెలిపారు.

సామగ్రి పంపిణీ

ఏర్పేడు: మండల కేంద్రమైన ఏర్పేడు గ్రామ పంచాయతీలో శుక్రవారం పంచాయతీ సర్పంచ్ నల్లపాళెం శివయ్య పారిశుద్ధ్య కార్మికులకు అవసరమైన వస్తు సామగ్రిని పంపిణీ చేశారు. వారికి యూనిఫాం దుస్తులతో పాటు బూట్లు, శానిటైజర్లు, సోపులు అందించారు. గ్రామంలో పారిశుద్ధ్య విలువలను మరింతగా పెంపొందించాలని వారిని ఆయన కోరారు.

కార్యదర్శులకు స్థానచలనం

నారాయణవనం: మండలంలోని పది గ్రామ పంచాయతీల కార్యదర్శులకు సాధారణ బదిలీల్లో భాగంగా స్థానచలనం కలిగిందని ఇన్‌చార్జి ఎంపీడీఓ గుణశేఖర్ తెలిపారు. అరణ్యంకండ్రిగ కార్యదర్శి భీమునిచెరువుకు బదిలీ అయ్యారు. సముదాయం, కొండలచెరువు, భీమునిచెరువు, తుంబూరు, ఎరికంబట్టు, కసిమిట్ట, కల్యాణపురం, బొప్పరాజుపాళ్యం, నైనారుకండ్రిగ, పాలమంగళం నార్త్, వెత్తలతడుకు కార్యదర్శులు ఇతర మండలాలకు బదిలీ అయినట్లు గుణశేఖర్ తెలిపారు.

బాధ్యతల స్వీకరణ

నాగలాపురం: మండల వ్యవసాయ శాఖ అధికారిగా కె.చిట్టిబాబు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. బంగారుపాళెంలో ఏఓగా పనిచేస్తున్న ఇక్కడికి బదిలీపై వచ్చారు.

ఏఓగా సాగరిక

ఏర్పేడు: మండల వ్యవసాయాధికారిగా బి.సాగరిక శుక్రవారం ఏర్పేడులోని వ్యవసాయ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు.

మడుగు కాదు.. వీధి

కాసింత వర్షానికి గ్రామీణ రోడ్లు బురదమయం అవుతున్నాయి. రోడ్లలో పెద్ద గోతులు ఏర్పడడంతో వాహనదారులు ఇక్కట్లుల పడుతున్నారు. ఏర్పేడే మండలం బండారుపల్లిలో గత రెండురోజులుగా కురిసిన కొద్దిపాటి వర్షానికే రోడ్లు మడుగులను తలపిస్తున్నాయి. గత ప్రభుత్వంలో ఎంపీ నిధులు వెచ్చించి సీసీ రోడ్లు నిర్మించారు. అయితే డ్రైనేజీ కాలువలు లేకపోవడంతో వర్షపు నీరు వెళ్లడానికి ఆస్కారం లేకపోవడంతో వీధుల్లోనే పారుతోంది. దీంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ఈ దారిలో వెళ్లాలంటే సాహసం చేయాల్సి వస్తోందని, తక్షణం గ్రామంలో డ్రైనేజీ కాలువలు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

–ఏర్పేడు



ఏర్పేడు: బండారుపల్లిలో వీధుల్లో నిలిచిన వర్షపు నీరు

అక్రమంగా గ్రావెల్ తరలింపు

తొట్టంబేడు మండలంలోని జీడీకాలనీలో ఉన్న ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఎదురుగా శుక్రవారం అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఎదురుగా జేసీబీలతో మట్టి తవ్వి అక్రమంగా తరలిస్తున్నారు. దీనిపై అధికారులు దృష్టి సారించకపోతే ఈ ప్రాంతమంతా గుంతలమయం అవుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అక్రమార్కులపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

–తొట్టంబేడు



జీడీ కాలనీలో జేసీబీతో గ్రావెల్‌ను తరలిస్తున్న అక్రమార్కులు

ఖాళీగా కార్యాలయం



వరదయ్యపాళెం హౌసింగ్ కార్యాలయంలో ఖాళీ కుర్చీలతో దర్శనమిస్తున్న ఏఈ గది



ఖాళీ కుర్చీలతో దర్శనమిస్తున్న సిబ్బంది గది

మండల హౌసింగ్ కార్యాలయ అధికారులు వేళకు విధులకు రావడం లేదు. గత కొద్దిరోజులుగా కార్యాలయం తలుపులు తెరిచి ఉంటారు గానీ అక్కడ అధికారులు మాత్రం ఉండరు. దీంతో హౌసింగ్ సమస్యలపై వచ్చే అర్జీదారులు అవస్థలు పడుతున్నారు. సమస్యలు ఎవరికి చెప్పాలో తెలియక కార్యాలయం వద్ద వేచి ఉండి ఎంతకీ అధికారులు రాకపోవడంతో వెనుదిరుగుతున్నారు. ఇంటి బిల్లులు, నూతన ఇళ్ల మంజూరు కోసం దరఖాస్తులు ఇచ్చేందుకు వచ్చి కార్యాలయంలో ఎవరూ లేకపోవడంతో సామాన్య ప్రజలు అవస్థ పడుతున్నారు. ఇప్పటికే మండల హౌసింగ్ ఏఈ పోస్టు ఖాళీగా ఉండగా వర్క్ ఇన్‌స్పెక్టర్లు అసలే లేరు. సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు మాత్రం మొక్కుబడిగా హౌసింగ్ పనులను పర్యవేక్షిస్తున్నారు. అయితే వారు కూడా కార్యాలయానికి రాకపోవడంపై విమర్శలు వెల్లువెత్తున్నాయి. ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలని హౌసింగ్ లబ్ధిదారులు కోరుతున్నారు.

–వరదయ్యపాళెం

శాంతియుతమైన జీవనం సాగించండి



డ్రోన్ కెమెరాలతో ఈశ్వరయ్య కాలనీని పర్యవేక్షిస్తున్న పోలీసులు, గ్రామంలో పోలీసుల పహారా

శ్రీకాళహస్తి: మండలంలోని ఈశ్వరయ్య ఎస్టీకాలనీలో సంచార ట్రైబల్స్ కుటుంబ, రాజకీయ కలహాలతో రెండు గ్రూపులుగా విడిపోయి.. ఒకరిపై ఒకరు కేసులు పెట్టుకుని గొడవలు పడుతుండడంతో వారి మధ్య సయోధ్య కుదర్చడానికి గత పది రోజులుగా మూడుసార్లు గ్రామసభలు నిర్వహించినట్లు డీఎస్పీ నరసింహమూర్తి తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఒక గ్రూపు ఆధిపత్యంతో మరో గ్రూప్ ఊరు వదలి వెళ్లిపోయిందన్నారు. అయితే వారిని పిలిపించి రెండు వర్గాలను రెవెన్యూ, పోలీసు, ఎంపీడీఓ ఆధ్వర్యంలో మూడుసార్లు గ్రామసభలు నిర్వహించి వారికి కౌన్సిలింగ్ ఇచ్చినట్లు తెలిపారు. గత మూడు రోజుల ముందు కూడా ఆర్డీఓ, తహసీల్దారు, పోలీసుల సమక్షంలో వారికి కౌన్సెలింగ్ ఇచ్చామన్నారు. శాంతియుత జీవనం సాగించడానికి భరోసా కల్పించామని, ఎవరైనా అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కొంతమంది వివాదాస్పద వ్యక్తులను తహసీల్దారు సమక్షంలో బైండోవర్ చేశామన్నారు. గ్రామంలో డ్రోన్‌తో పర్యవేక్షిస్తూ పికెట్ కూడా ఏర్పాటు చేశామన్నారు. గ్రామంలో సాధారణ పరిస్థితులు వచ్చే వరకు పర్యవేక్షిస్తామన్నారు. శుక్రవారం మరోమారు రెండు వర్గాల మధ్య ఘర్షణ వాతావరణం ఏర్పడగా సీఐ తిమ్మయ్య, ఎస్‌ఐ నరసింహులు వివాదాన్ని సద్దుమణిచారు.

ధ్రువీకరించుకుంటేనే అన్నదాత సుఖీభవ

సత్యవేడు: రైతులు సంబంధిత సచివాలయ వ్యవసాయ అసిస్టెంట్ల వద్ద వేలి ముద్రలు వేసి ధ్రువీకరించుకుంటేనే అన్నదాత సుఖీభవ సొమ్మును ప్రభుత్వం జమ చేస్తుందని మండల వ్యవసాయ అధికారి మురళి తెలిపారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ మండలంలోని 26 రెవెన్యూ గ్రామాలకు సంబంధించి అర్హులైన రైతులు 3485 మంది ఉన్నట్లు తెలిపారు. అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకం కింద ఒక్కో కుటుంబానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏడాదికి రూ.20 వేలు జమ చేస్తాయన్నారు. ఇందులో అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.14 వేలు, కేంద్రప్రభుత్వం రూ.6 వేలు ఇస్తుందన్నారు. రైతులు తమ పరిధిలోని సచివాలయానికి వెళ్లి వ్యవసాయ అసిస్టెంట్లను కలిసి ఈ నెల 20వ తేదీలోపు వేలిముద్రలు వేయాలన్నారు.

11కేవీ ఫీడర్ ప్రారంభం



వ్యవసాయానికి 3 ఫేజ్ ఫీడర్‌ను ప్రారంభించిన ఈఈ బాలాజీ

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని పల్లమాల సబ్‌స్టేషన్ పరిధిలోని రైతులకు 3 ఫేస్ విద్యుత్‌ను సరఫరా చేయనున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బాలాజీ తెలిపారు. ఆయన శుక్రవారం పల్లమాల సబ్‌స్టేషన్‌లో 3 ఫేజ్ విద్యుత్ సరఫరా కోసం సపరేటుగా ఏర్పాటు చేసిన 11 కేవీ ఫీడర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లమాల సబ్‌స్టేషన్‌లో వ్యవసాయానికి 3 ఫేజ్ కోసం 11 కేవీ సప్లైను సపరేటుగా విస్తరించినట్లు తెలిపారు. దీని వల్ల ఆలత్తూరు, పల్లమాల, కాటూరు ఫీడర్స్ పరిధిలోని కత్తివారికండ్రిగ, బసవన్నగుంట, పీవీకండ్రిగ, ఏ.పార్లపల్లి, పీఎన్‌గుంట, దొంగల మూడూరు, కారాకోల్లు, కాటూరు, పద్మావతిపురం, వేణుగోపాలపురం, వీఎస్‌పురం, నక్కవారి కండ్రిగ గ్రామాల రైతులకు 3 ఫేజ్ విద్యుత్ సరఫరాకు ఇబ్బంది లేకుండా ఉంటుందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈఈ భాస్కర్‌నాయుడు, ఏఈలు చలపతి, రవి, తదితరులు పాల్గొన్నారు.

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి



ర్యాలీ చేస్తున్న ప్రగతిసేవా స్వచ్ఛంద సంస్థ సభ్యులు

శ్రీకాళహస్తి: బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి చేద్దామని ప్రగతి స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్ కేవీ రమణ అన్నారు. శ్రీకాళహస్తి పట్టణంలో శుక్రవారం ప్రగతి సంస్థ, పోలీసులు, కార్మికశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక తనిఖీలు చేశారు. వస్త్రదుకాణాలు, హోటల్స్, ఇతర దుకాణాలను తనిఖీ చేసి 18 సంవత్సరాల లోపు 8మంది బాలకార్మికులను గుర్తించారు. దుకాణ నిర్వాహకులపై చర్యలకు ఉపక్రమించారు. ఈసందర్భంగా కేవీ రమణ మాట్లాడుతూ బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన కోసం బెంగళూరుకు చెందిన క్రై సంస్థ సహకారంతో కృషి చేస్తున్నామన్నారు. అందులో భాగంగా ఈ తనిఖీలు చేపట్టినట్లు వివరించారు. బాల కార్మికులకు విముక్తి కల్పించి పాఠశాలల్లో చేర్పించడం ఆనందంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో కార్మికశాఖ అసిస్టెంట్ కమిషనర్ చిన్నలాలెప్ప, అధికారులు శ్రీమన్నారాయణ, రంగనాథం, ప్రవీణ్‌కుమార్, పోలీసు సిబ్బంది, ప్రగతి సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థిని మృతి



శిరీష (ఫైల్)

కేవీబీపురం: అనారోగ్యంతో ఇంటర్ విద్యార్థిని మృత్యువాత పడిన ఘటన శుక్రవారం కేవీబీపురం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కేవీబీపురం గ్రామానికి చెందిన పైడి వెంకటరత్నం, రాజేశ్వరి కుమార్తె పైడి శిరీష(16) మండల కేంద్రంలోని ఆదర్శపాఠశాలలో ఇంటర్ పూర్తి చేసి శ్రీకాళహస్తిలో బీఎస్సీకి దరఖాస్తు చేసుకుంది. అయితే గురువారం బంధువుల శుభకార్యానికి హాజరై అక్కడే భోజనం పూర్తి చేసుకుని ఇంటికి చేరుకుంది. ఇంటికి చేరుకున్న కొంత సేపటికే వాంతులు కావడంతో తల్లిదండ్రులు స్థానిక పీహెచ్‌సీలో వైద్యం అందించారు. తెల్లవారుజామున విద్యార్థిని తీవ్ర అస్వస్థతకు గురైంది. కుటుంబ సభ్యులు హుటాహుటిన శ్రీకాళహస్తి ఆసుపత్రికి తరలించారు. మార్గమధ్యలోనే ఆ బాలిక మృత్యువాత పడింది.

పంట నాశనంపై ఫిర్యాదు



దెబ్బతిన్న పంట వద్ద విజయ్‌శేఖర్ దంపతులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని గాజులపెళ్లూరులో వరి పంటను విషపూరిత మందులు చల్లి నాశనం చేశారని కాటూరు విజయ్‌శేఖర్ అనే రైతు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. భూతగాదాల నేపథ్యంలో జయరామయ్య, శ్రీహరి, ఫణీంద్ర, సుభాషిణి అనే వ్యక్తులు తన 3 ఎకరాల్లో సాగు చేసిన వరితోపాటు పక్కనే కుమార్ అనే రైతుకు చెందిన 30 సెంట్లలో వరి పైరును విషపూరిత మందులతో దెబ్బతీశారని పేర్కొన్నారు. ఎకరాకు రూ.50వేల చొప్పున పెట్టుబడి పెట్టామని, ఇప్పుడు పూర్తిగా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. నిందితులపై చర్యలు తీసుకుని, తమకు నష్టపరిహారం ఇప్పించాలని కోరారు.

బాధ్యతల స్వీకరణ



రఘుపతి

వరదయ్యపాళెం: మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్‌గా ఎ.రఘుపతి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన పుత్తూరు బాలికల జూనియర్ కళాశాల నుంచి బదిలీపై రాగా ఇక్కడ పనిచేస్తున్న ప్రిన్సిపల్ పద్మావతి పుత్తూరు బాలికల జూనియర్ కళాశాలకు బదిలీ అయ్యారు. బాధ్యతలు స్వీకరించిన ప్రిన్సిపల్ రఘుపతికి కళాశాల అధ్యాపక బృందం స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కళాశాల అభివృద్ధితో పాటు విద్యార్థులు ఉత్తమ ఫలితాల సాధన దిశగా కృషి చేస్తానని తెలిపారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ



భోజనం వడ్డిస్తున్న ఎంఈఓలు

బుచ్చినాయుడుకండ్రిగ: ప్రభుత్వ పాఠశాలల్లో అమలు అవుతున్న డొక్కాసీతమ్మ మధ్యాహ్న పథకంలో రుచికరమైన భోజనాన్ని విద్యార్థులకు పెట్టాలని, వంట నిర్వాహకులు అవకతవకలకు పాల్పడితే తొలగిస్తామని మండల విద్యాశాఖాధికారులు రవీంద్రనాథ్, మునిసుబ్రమణ్యం తెలిపారు. వారు శుక్రవారం బుచ్చినాయుడుకండ్రిగలోని జెడ్పీ ఉన్నత పాఠశాల్లో మధ్యాహ్న భోజనాన్ని రుచి చూశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు ప్రభుత్వ మెనూ ప్రకారం రుచికరమైన భోజనాన్ని అందించాలని తెలిపారు. మెనూ ప్రకారం భోజనం పెట్టకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో హెచ్ఎం రమణయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరానికి స్పందన

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మెయిన్ బ్రాంచ్‌లో బ్రాంచ్ మేనేజర్ ఫణికుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది రక్తదానం చేశారు. శ్రీకాళహస్తి ఏరియా హాస్పిటల్ వైద్య సిబ్బంది రక్తం సేకరించారు. ఏరియా హాస్పిటల్ డాక్టర్ మణి మాట్లాడుతూ రక్తదానం చేయడం సామాజిక బాధ్యత అన్నారు. ప్రతి ఒక్కరూ రక్తదానం చేస్తే ముగ్గురి ప్రాణాలు కాపాడడం జరుగుతుందన్నారు. బ్యాంకు మేనేజర్ మాట్లాడుతూ ఖాతాదారులతో కలిసి ఉద్యోగ సిబ్బంది సేవా కార్యక్రమంలో భాగంగా రక్తదానం చేయడం జరిగింది అన్నారు.

మెరుగైన వైద్యం అందించాలి

నాగలాపురం: ప్రభుత్వ ఆస్పత్రుల ద్వారా పేదలకు మెరుగైన వైద్యం అందించాలని డీఎంఅండ్‌హెచ్‌ఓ బాలకృష్ణ నాయక్‌ను ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం కోరారు. ఈ మేరకు శుక్రవారం ఉదయం పిచ్చాటూరు, నాగలాపురంలో డీఎంఅండ్‌హెచ్‌ఓ బాలకృష్ణ నాయక్‌తో కలిసి ఎమ్మెల్యే ఆదిమూలం నూతనంగా నిర్మించిన ప్రజా ఆరోగ్య కేంద్ర భవనాన్ని ప్రారంభించారు. ఎంపీడీఓ బాలాజీ నాయక్, తహసీల్దార్ టీవీ సుబ్రమణ్యం, డాక్టర్ విజయ్ కుమార్, మునిచరిత్ర, ఎంఈఓ హేమామాలిని, నాయకులు చిన్నదొరై, శ్రీనివాస యాదవ్, సెల్వకుమార్, డాక్టర్ శేషాద్రి, శ్యామ్, మురళి, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతున్నట్లు తిరుపతి రూరల్ ఈఈ చిన్నరెడ్డెప్ప తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. అందులో భాగంగా 33/11 కేవీ సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు శ్రీకాళహస్తి పట్టణం, రూరల్, కేవీబీపురం, బుచ్చినాయుడుకండ్రిగ, ఏర్పేడు, తొట్టంబేడలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

రేణిగుంట: రేణిగుంట విద్యుత్ సబ్ డివిజన్ పరిధిలోని తూకివాకం, కరకంబాడి, గురవరాజుపల్లి ఎలమండ్యం, గాజులమండ్యం, కురకాలువ సబ్ స్టేషన్ల పరిధిలో శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ డీఈ రమేష్‌బాబు ఓ ప్రకటనలో తెలిపారు. 11 కేవీ లైన్లు, ఎల్‌టీ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు విద్యుత్ లైన్లకు ఆటంకం కలిగించే చెట్లను తొలగించే పనులు చేపట్టనున్నట్లు చెప్పారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

నాగలాపురంలో..

నాగలాపురం: మండలంలోని సుబ్బనాయుడు కండ్రిగ, బీరకుప్పం సబ్ స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏడీ రమేష్ చంద్ర, అసిస్టెంట్ ఇంజినీర్ పృథ్వీ తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సబ్ స్టేషన్ మెయింటెనెన్స్ మరమ్మతుల కారణంగా విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు.

ఘనంగా రేణుక ఎల్లమ్మ జాతర



పొంగళ్లు తీసుకెళ్తున్న మహిళలు

ఏర్పేడు: మండలంలోని మేర్లపాక పంచాయతీ కొత్తకండ్రిగలో శ్రీ శీతలాంబ, శ్రీ రేణుక ఎల్లమ్మ దేవతలకు శుక్రవారంవిశేష అభిషేకాలు నిర్వహించారు. మహిళలు సామూహికంగా ఆలయానికి చేరుకుని అక్కడ పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఏర్పేడు ఎంపీటీసీ మాజీ సభ్యులు తోటకూర కోటేశ్వరరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఊంజల్ సేవలో పద్మావతీ అమ్మవారు



ఉయ్యాల సేవలో పద్మావతీ అమ్మవారు

నారాయణవనం: పద్మావతీ అమ్మవారు శుక్రవారం సాయంత్రం ఉయ్యాల సేవలో భక్తులకు దర్శనమిచ్చారు. పద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని సుప్రభాత సేవతో తెరచిన అర్చకులు నిత్యపూజా కైంకర్యాలను చేశారు. ఉదయం 7 గంటలకు వేంకటేశ్వరస్వామికి, 8 గంటలకు పద్మావతీ అమ్మవారికి శుక్రవార అభిషేకాలను పూర్తి చేశారు. సాయంత్రం నిత్యకైంకర్యాలను నిర్వహించిన అర్చకులు తిరుచ్చి వాహనంపై పద్మావతీ అమ్మవారిని సుందరంగా అలంకరించి అధిష్ఠింపజేశారు. అంతర ప్రాకారంలో ఊరేగిన అమ్మవారికి ఊంజల్ మండపంలో ఉయ్యాల సేవలో నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఆలయ అధికారి నాగరాజు, ఆర్జితం అధికారి భరత్, అర్చకులు శ్రీనివాసభట్టాచార్య ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నాఫ్ ఇండియా పరిశ్రమకు గ్రీన్ అవార్డు



గ్రీన్‌కో అవార్డు అందుకుంటున్న నాఫ్ ఇండియా (ఏపీ, తెలంగాణ, ఒడిశా) సేల్స్ హెడ్ నాగరాజు

శ్రీసిటీ (వరదయ్యపాళెం): శ్రీసిటీలోని నాఫ్ ఇండియా పరిశ్రమకు ప్రతిష్ఠాత్మక ×గ్రీన్‌ (పర్యావరణ హిత సంస్థ) గుర్తింపు దక్కింది. ఈ నెల 12న హైదరాబాద్‌లో కాన్ఫడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) నిర్వహించిన ।గ్రీన్‌కో సమ్మిట్ 2025 కార్యక్రమంలో ఈ అవార్డును నాఫ్ ఇండియాకు అందజేశారు. 12, 13 తేదీల్లో రెండు రోజుల పాటు నిర్వహించిన ఈ అంతర్జాతీయ సదస్సులో నికర–సున్నా పరివర్తన, వృత్తాకార ఆర్థిక వ్యవస్థ, సుస్థిర అభివృద్ధి, ఏఐ తదితర రంగాలకు సంబంధించిన అంతర్జాతీయ నిపుణులు, పరిశ్రమ ప్రముఖులు, విధాన నిర్ణేతలు, ఆవిష్కర్తలు పాల్గొన్నారు. ప్రపంచవ్యాప్త మార్గదర్శకాలకు అనుగుణంగా సీఐఐ అభివృద్ధి చేసిన గ్రీన్‌కో రేటింగ్ వ్యవస్థ ద్వారా వివిధ సంస్థల పర్యావరణ పనితీరును అంచనా వేస్తుంది. సహజ వనరుల సమర్థవంతమైన వినియోగం, కాలుష్య తగ్గింపు, స్థిరమైన పద్ధతులను ప్రోత్సహిస్తుంది. ఈ మేరకు గుర్తింపు పొందిన నాఫ్ ఇండియా, గ్రీన్ తయారీ, పర్యావరణ నిర్వహణలో తన నిబద్ధతను చాటుకుంది. తక్కువ–కార్బన్ ఉత్పత్తి పద్ధతులను వినియోగించి నాణ్యమైన నిర్మాణ సామగ్రి వినియోగంతో పాటు శక్తి, నీటిని సమర్థవంతంగా కంపెనీ ఉపయోగించింది. దేశంలో పర్యావరణ స్పృహతో కూడిన మౌళిక సదుపాయాల కల్పనకు ఇది అద్దం పడుతోంది. నాఫ్ బృందాన్ని అభినందించిన శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, ఈ గుర్తింపు శ్రీసిటీకి గర్వకారణం అంటూ తన సందేశంలో పేర్కొన్నారు. తాము ప్రోత్సహించే సుస్థిర పారిశ్రామిక అభివృద్ధి స్ఫూర్తిని ఇది ప్రతిబింబిస్తుందని వ్యాఖ్యానించారు. గ్రీన్ తయారీకి కొత్త ప్రమాణాలను పాటించడంలో ఇతర సంస్థలకు నాఫ్ ఆదర్శంగా నిలుస్తుందని కొనియాడారు.

గాయపడిన యువకుడి మృతి

- వారం కిందట కారిపాకంలో జరిగిన గ్రామోత్సవంలో అపశృతి
- టపానులు పేల్చుతుండగా నిల్వ ఉంచిన టపాకాయలపై పడిన నిప్పు రవ్వలు
- అక్కడే ఉన్న ఓ యువకుడికి తీవ్ర గాయాలు
- చెన్నైలో చికిత్స పొందుతూ మృతి



లోకేష్ (ఫైల్)

వరదయ్యపాళెం: మండలంలోని కారిపాకంలో జరిగిన గ్రామ దేవత గ్రామోత్సవంలో అపశృతి చోటు చేసుకుంది. గ్రామోత్సవం కోసం తీసుకొచ్చిన టపాకాయలపై నిప్పు రవ్వలు పడి ఒక్కసారిగా పేలుడు సంభవించడంతో అక్కడే ఉన్న ఓ యువకుడు తీవ్ర గాయాల పాలై తమిళనాడులో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యులు వరదయ్యపాళెం పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా.. కారిపాకం గ్రామానికి చెందిన ఉష, కృష్ణ దంపతులకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు లోకేష్(18) ఇంటర్ పూర్తి చేసి పైచదువుల కోసం ఇంటి వద్ద ఉన్నాడు. గత శుక్రవారం కారిపాకంలో గ్రామ దేవతకు సామూహిక పొంగళ్లు పెట్టారు. అదే రోజు అర్ధరాత్రి గ్రామోత్సవం మొదలవగా అమ్మవారి ఆలయ పరిసరాల్లో టపాకాయలు నిల్వ ఉంచారు. అయితే అప్పటికే కొన్ని టపాకాయలు పేల్చగా వాటి నుంచి వచ్చే నిప్పు రవ్వలు నిల్వ ఉంచిన టపాకాయలపై పడడంతో ఒక్కసారిగా పేలుడు సంభవించిందిజ ఆ సమయంలో యువకుడు లోకేష్ అక్కడే ఉండడంతో తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం చెన్నైకి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం లోకేష్(18) మరణించాడు. దీంతో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి. ఒక్కొగానొక్క కొడుకు మరణించడంతో కృష్ణయ్య కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది. శవ పంచనామా నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్‌ఐ మల్లికార్జున తెలిపారు.